# సాహిత్య శరధి

- డా॥ డి. నల్లన్న
తెలుగు విభాగం
రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం
తిరుపతి- 517 507
చరవాణి: 9492434953

తెలంగాణాకు వెనుకుబాటుతనం సాహిత్యపరంగా ఎప్పుడూ లేదు. 12వ శతాబ్దంలోనే పాల్కురికి సోమనాథుడు తెలంగాణ గడ్డమీద తెలుగు సాహిత్య పతాకాన్ని ఎగురవేశాడు. అప్పటినుంచీ కూడా ఈ గడ్డమీద సాహితీసృజన అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది. ఆధునిక యుగంలో కూడా సి.నారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి వంటి మహాకవులెందరో వెలిశారు. అఖిలాంధ్రావనికి అనంత కాంతి, క్రాంతిని, శాంతిని పంచిపెట్టారు. వారిలోనూ దాశరథి కృష్ణమాచార్యులకు ఎంతో ప్రత్యేకత ఉంది. మరెంతో ప్రాధాన్యత ఉంది. దాశరథి గారి జీవన పథాన్ని, సాహిత్యపథాన్ని సంస్మరించుకునేందుకు ఈ వ్యాసం తోడ్పడుతుంది.

'నా తెలంగాణ కోటి రత్నాలవీణ' అని తెలంగాణ ఘనతను ఎలుగెత్తి చాటిన వెలుగు కిరణం దాశరథి. నిజాం పరిపాలనకు నొచ్చిరెచ్చి "మా నిజాం రాజు జన్మజన్మాల బూజు" అని గడ్డురోజుల్లోనే నిజాంను విమర్శించిన ధైర్యశాలి ఈయన. సంస్కృతాంధ్రాలలోనేగాక ఉర్దూ, పార్సీ భాషల్లోనూ పాండిత్యం గడించి రచనలు చేయగల దిట్ట. ఈ సాహితీస్రష్ట. బాల్యం నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని కృష్ణ జన్మస్థానాలను సైతం సందర్శించి చివరికి ఆస్థానకవి స్థానాన్ని కూడా అలంకరించిన అనుపమ కీర్తి శరధి దాశరథి.

అద్వితీయ కాకతీయ రాచరికానికి ఆలవాలమైన వరంగల్లు జిల్లాలో చిన్నగూడూరు గ్రామం ఉంది. ఆ గ్రామానికి చెందిన దాశరథి వెంకటాచార్యులు. వెంకటమ్మ దంపతులకు 1925వ సంవత్సరం, జులై 22వ తారీఖున (క్రోధన వత్సరం శ్రావణ శుక్ల ద్వితీయ) దాశరథి జన్మించాడు. తల్లిదండ్రులితనికి కృష్ణమాచార్యులు అని నామకరణం చేశారు. ఈయన సాహితీరంగ ప్రవేశం చేసిన తరువాత ఈ 'కృష్ణమాచార్య' మరుగునపడి 'దాశరథి' అనే పేరుకే ప్రసిద్ధి వచ్చింది. దాశరథి తండ్రి వెంకటాచార్యులు సంస్కృతాంధ్ర ద్రావిడ భాషల్లో పండితులు కాబట్టి కుమారుడికి ఇంటి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలను బోధించాడు. ఖమ్మం నగరంలోని ఉస్మానియా హైస్కూల్లో దాశరథి మెట్రిక్యులేషన్ పూర్తిచేశాడు. స్వయంకృషితోనే ఇంటర్మీడియేట్ పూర్తి చేశాడు. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయ సాయంకాల కళాశాలలో ఆంగ్లం ప్రధాన విషయంగా బి.ఏ. చేశాడు.

రైతుల కష్టాలు, కూలీల కడగండ్లు నిజాం పాలనలో సామాన్యులు పడే బాధలు బాల్యం నుంచే దాశరథిని ప్రభావితం చేశాయి. మెట్రిక్యులేషన్ తరువాత చదువు కొనసాగించలేకపోయాడు. 1943 ప్రాంతంలో 'గార్ల' జాగీరులో ప్రారంభమైన నిజాం వ్యతిరేకోద్యమంలోకి దూకాడు. దాశరథి ఉద్యమ కవిత్వం వెలయించాడు. ఉద్యమానికి ప్రజలను ప్రేరేపించాడు. తాను కూడా తీవ్రంగా పోరాటం సాగించాడు. ఇవన్నీ నిజాం ప్రభుత్వానికి దడ పుట్టించాయి. పోలీసులు దాశరథి వెంటపడ్డారు. ఆ వామనుడు మరింత వామనుడై పోలీసుల కన్ను గప్పి తిరుగసాగాడు. పట్టణాలు, పల్లెటూళ్ళు కడకు అడవులు సైతం అతనికి లెక్కలోకి వచ్చేవి కావు. 1946 డిసెంబర్

18న మానుకోట తాలూకాకు చెందిన ఒక గ్రామంలో దాశరథి ఉపన్యసించాడు. తెలంగాణ రైతుదే అని గర్జించాడు. ముసలినక్కకు రాచరికం దక్కదని తెగేసి చెప్పాడు. ఆ సమయంలోనే పోలీసులు అతన్ని చుట్టుముట్టారు. అరెస్టు చేశారు. అయితే దాశరథి పోలీసుల కన్నుగప్పి తప్పించుకున్నారు. జొన్న పొలాల్లో దూరి మహబూబాబాద్ అడవుల్లో తలదాచుకొని 'నాగారం' అనే గ్రామం చేరుకున్నాడు. అక్కడ అతణ్ణి ఒక మిత్రుడు ఆదరించాడు. చికిత్స చేయించి స్వస్థత చేకూరేటట్టు చేశాడు. తరువాత కూడా దాశరథి ఉద్యమం నుంచి విరమించుకోలేదు. మారువేషంలో తిరుగుతూ తన కార్యకలాపాలు కొనసాగించాడు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికి నిజాం గద్దె దిగలేదు. కాబట్టి రాష్ట్ర కాంగ్రెసు సత్యాగ్రహాన్ని తలపెట్టింది. దాశరథి పాల్గొన్నాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. కొరడా దెబ్బలు తిన్నాడు. అతనికి 16 నెలలు కఠిన కారాగార శిక్షపడింది. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్‌లోని చెంచల్‌గూడా జైళ్ళలో జీవితం గడిపాడు. 1948 జనవరి 11 దాశరథి జీవితంలో మరపురాని భయంకర దినం. పోలీసులు అతనిని చితకబాదారు. రెండు ఎముకలు కూడా విరిగిపోయాయి. దాశరథి ఇక లేడని మిత్రులంతా అనుకున్నారు. దాశరథి ఆ రాత్రంతా స్పృహ లేకుండా గడిపాడు. ఉదయం ఎలాగో కోలుకొని కళ్ళు తెరిచాడు. అతనికి చికిత్స జరిగింది. ఎలాగో క్రమంగా స్వస్థుడయ్యాడు. 1948 సెప్టెంబర్ 14 తారీఖున పోలీసు చర్య జరిగింది. హైదరాబాద్ సంస్థానం కూడా భారతదేశంలో విలీనమయ్యింది. దాశరథి కూడా విడుదలయ్యాడు.

దాశరథికి 1950లో వివాహమయ్యింది. కొంతకాలం పంచాయితీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేశారు. ఈ ఉద్యోగం చేస్తున్నప్పుడే పలు తెలంగాణ పల్లెల్లో తిరిగాడు. అక్కడి స్థితిగతులను తెలుసుకున్నాడు. ప్రజల ఇబ్బందులను గుర్తించాడు. 1956లో తాత్కాలిక ప్రాతిపదికన ఆలిండియా రేడియోలో 'ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్'గా చేరాడు. కొంతకాలానికి ఆ ఉద్యోగం నిరంతమయ్యింది. ఈ ఉద్యోగ కాలంలోనే ఆయన సాహిత్య సృజన సజావుగా, బహుముఖంగా సాగింది.

దాశరథికి సంస్కృతం, తెలుగు, ఉర్దూ, పార్సీ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి పట్టు ఉంది. ఆయా భాషలకు చెందిన గ్రంథాలను అక్కరతో చదివాడు. ఆ సాహిత్యాల్లో చోటుచేసుకొన్న భావ సంపదను శిల్పసౌందర్యాన్ని అభివ్యక్తీకరణ విధానాన్ని అర్థం చేసుకున్నాడు. ఉత్తేజం పొందాడు. ఆ తేజంతోనే ఆంధ్ర పాఠకుల అంతరంగంలోని అంధకారాన్ని అంతం చేయజూసాడు. ఆయన కలం నుంచి ఎన్నో అక్షరాలు వెలువడి అక్షర రూపం దాల్చాయి. ఆయన గళం వెలువరించిన ఎన్నో శబ్ద చిత్రాలు మనోహర మధురభరితాలు.

వీరి మొదటి రచన అగ్నిధార. ఇది 1949లో వెలువడింది. దీనిని 'సాహితీమేఖల' అనే సాహిత్య సంస్థ పక్షాన దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతరావు ప్రచురించారు. దీనిలో ప్రణయావేశం ఉంది. ప్రళయావేశం ఉంది. ఇది దాశరథికి కవిగా మంచి ప్రసిద్ధి తెచ్చిపెట్టింది. దీనిలోని ఖండికల్లో అధికభాగం దాశరథి జైలులో ఉన్నప్పుడు రాసినవే. ఇవే కాకుండా దేశభక్తి, ప్రకృతికి సంబంధించిన ఖండికలు కూడా 'అగ్నిధార'లో చోటుచేసుకున్నాయి.

అగ్నిధార తరువాత పేర్కొనదగింది రుద్రవీణ. ఇది 1950లో వెలువడింది. దీనిలోని ఖండికలన్నీ తెలంగాణకు సంబంధించినవే. రుద్రవీణ అనే పేరులోనే కవి రౌద్రం కనిపిస్తుంది. ఆకలితో అలమటించే శ్రామికుల అంగలార్పును ఆవిష్కరించే అపురూపవాణి రుద్రవీణ. దీనిలోని ఖండికలన్నీ శ్రామికుల అభ్యున్నతిని కాంక్షిస్తాయి. నిజాం నిరంకుశతను నిరసిస్తాయి. దాశరథి రుద్రవీణను తెలంగాణ తెలంగాణ తల్లికి అంకితం చేశాడు. దీనిలో దేశభక్తి స్వేచ్ఛా ప్రియత్వం, సామ్యవాద స్పృహ స్పష్టంగా కనిపిస్తాయి.

 ISSN NO : 1869-9391

దాశరథి మరో రచన 'మహాంధ్రోదయం'. విముక్త తెలంగాణ ఆంధ్ర రాష్ట్రంలో ఐక్యం కావడాన్ని పురస్కరించుకుని ఈ రచన రూపుదిద్దుకుంది. దాశరథి నాల్గవ కవితా సంపుటి 'పునర్నవం'. ఇది 1956లో వెలువడింది. ఈ సంపుటిలో వచన ఖండికలు అధికంగా, గేయఖండికలు కొద్దిగా చోటుచేసుకొన్నాయి. పద్య ఖండికలు లేవు. ఇది ఇందులోని ప్రత్యేకత. అంతేకాకుండా దృక్పథంలో కూడా విభిన్నత, విస్తృతి కనిపిస్తుంది. సంపుటిలో అత్యధికంగా సామ్యవాద భావాలే ఉన్నాయి. ఉన్నంతలో అందరూ కలిసి భోంచేయడం సహజీవనం. దీనికన్నా సామ్యవాదం ఏమిటి? అంతకన్నా ప్రజాస్వామ్యం ఎక్కడ? అని ప్రశ్నించాడు. పునర్నవంలోని ప్రతి ఖండిక విలువైందే. దీన్ని సమీక్షించిన పి.వి. రత్నం "శ్రీదాశరథి ప్రతిభను చూపడానికి, చాటడానికి మనమంతా సగర్వంగా చెప్పుకోవడానికి ఒక్క పునర్నవం చాలదా?" అన్నాడు.

2500వ బుద్ధ జయంతి సందర్భంగా మహాబోధి రూపుదిద్దుకొంది. మహాపద్మ భదంత జాతక కథలు దీనిలో చిత్రింపబడ్డాయి. మహాబోధి ఏక కావ్యంగానే రూపుదిద్దుకుంది. ఇందులో ప్రబంధ రీతిలో షష్ఠ్యంతాలు కూడా ఉన్నాయి.

ఆకాశవాణిలో ఉద్యోగం చేసేకాలంలో చాలా రేడియో నాటికలు రచించాడు. అందులో తొమ్మిదింటిని 'నవమి'గా సంకలనం చేశాడు. వీటిలో చారిత్రకాలు, స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించినవి, సాంఘిక సమస్యలను, పరిశీలించే నాటికలూ ఉన్నాయి. ఈ సంకలనంలో దాశరథి ప్రతిభను చాటే స్వంత రచనలే కాక అనువాద రచనలు కూడా చోటుచేసుకోవడం గమనార్హం. దాశరథి గేయకృతి 'నవమంజరి'. దీనిలో చాలా లలితగేయాలున్నాయి. భావప్రధానంగా సాగిన ఈ గేయాలు ప్రణయ ప్రపూరితాలు. కలువలు, చంద్రుడు, మేఘాలు, మెరుపులు, మామిడిచిగుళ్ళు మొదలైనవి ఈ గేయాల్లోని ప్రధానాంశాలు. వీరి అమృతాభిషేకం, కవితాసంపుటి 1960లో వెలువడింది. అజ్ఞావిజ్ఞానాలకు ప్రతీకలుగా చీకటి వెలుగులను కవి ప్రతిపాదించాడు. తామసి, దీపాంగన, చీకటినటి, చేతనా జ్యోతి వంటి ఖండికలలో వెలుతురు, చీకటికి సంబంధించిన విషయాలున్నాయి.

మీర్జాగాలిబ్ రచించిన గాలిబ్ గీతాలను 1961లో అనువదించాడు. భావ ప్రధానంగానే ఈ అనువాదం సాగింది. దీనిలో తెలుగుదనమే కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది. మూలంలోని 'గజల్'కు సమానంగా దాశరథి గీత పద్యాలు సగం సగం అంటే రెండేసి పాదాలుగా ఉపయోగించాడు. కొన్నిచోట్ల మాత్రం నాలుగు పాదాలు రాయవలసి వచ్చింది. కొన్నిచోట్ల ద్విపద, రగడలు కూడా కనిపిస్తాయి. బాగా ప్రఖ్యాతి గాంచిన అతి ముఖ్యమైన గాలిబ్ గీతాలన్నీ అనువదింపబడ్డాయి. గాలిబ్ కవితలే కాకుండా జఫర్, మీర్ వంటి ఉర్దూ మహాకవుల రచనలను కూడా గాలిబ్ గీతాలు ధోరణిలోనే దాశరథి అనువదించాడు. ఈ గ్రంథానికి 1965లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బహుమతి లభించింది.

దాశరథి శతకాన్ని కూడా రచించాడు. దీని పేరు కూడా 'దాశరథి శతకం' ఇది పేరులో మాత్రమే కంచర్ల గోపన్న శతకాన్ని తలపిస్తుంది. కాని దీనిలో భక్తిలేదు. ఆధునిక లోకరీతి ఉంది. వ్యంగ ప్రీతి ఉంది. దీనిలో కవి భావాలు, అనుభవాలు పద్యరూపం దాల్చాయి. ఆధునిక శతకాల్లో పేర్కొదగ్గ శతకమిది. రాజకీయ, సాంఘిక నైతిక వ్యవస్థలోని కలుషిత వాతావరణాన్ని విమర్శించడానికి ఈ శతకం చక్కగా ఉపకరించింది. ప్రజల కష్టనష్టాలను పట్టించుకోకుండా తమ స్వార్థంతో డబ్బు సంపాదించే నాయకులను గద్దెలు దింపాలని ఈ శతకంలో ప్రజలకు బోధించాడు. ప్రజాస్వామ్యంలో వయోజనుల ఓటుహక్కు విలువను గురించి చెప్పి, ఎలాంటి నాయకుని ఎన్నుకోవడం వల్ల ఓటు సద్వినియోగమవుతుందో వివరించాడు.

'కవితా పుష్పకం' ఒక చక్కని కవితాసంపుటి. పాఠకలోకాన్ని పరవశింపచేసిన సంపుటిది. ఇది 1966లో వెలువడింది. దీనిలో ఉన్నవి పండుగల సందర్భాలలో రచింపబడిన సామయిక కవితలు, వీటిలో కొన్ని అనువాదాలు, మరికొన్ని ప్రణయ వాసనలు గల కవితలు, మిగిలినవి శాంతి ప్రియత్వాన్ని, మానవాభ్యుదయాన్ని కోరేవి. దీనిలోనే మీర్ కవితలను, జఫర్ మధుతరంగాలను చక్కగా అనువదించాడు. ఈ సంపుటి 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ సంపుటిగా ఎన్నిక చేసింది.

కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన కవితా సంపుటి 'తిమిరంతో సమరం' అజ్ఞానానికి ప్రతీక తిమిరం. దీనితో సమరం సాగించాలనే దాశరథి పూనికే ఈ సంపుటికి జీవం. హింసతో గాక శాంతితోనే విప్లవాన్ని సాధించాలనీ దాశరథి అభిప్రాయపడ్డాడు. ఆయన ఆలోచనా పరిమళం ఈ సంపుటి అంతా గుబాళించి వ్యాపించింది. దాశరథి హింస మీద తన ఆగ్రహాన్ని ప్రకటించాడు.

'హింస నుండి సమాజ

హంస ఉద్భవించుననే

అసత్యాన్ని నమ్మకు

హంతకుడవు కాబోకు' అని ఉద్బోధిస్తాడు. కాని సమయం వచ్చినప్పుడు రాక్షసత్వాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు మర్దనమే మహౌషధంగా నమ్ముతాడు. అప్పుడు తాత్కాలికంగా పెన్ను జేబులో పెట్టి గన్ను చేత పట్టాలంటాడు. తిమిరంతో సమరంలో శాంతిప్రియత్వం, మానవతతో బాటు విశ్వమానవ సౌభ్రాతృత్వం కూడా కనిపిస్తుంది.

1975లో వెలుగుచూసిన దాశరథి కవితా సంపుటి 'ఆలోచనాలోచనాలు'. కార్మికుల పక్షాన నిలబడి గజదంత గోపురంలో కాదు కాపురం కార్మికులు గలపురం కవికి అంతఃపురం (గజదంత గోపురం) అంటాడు. తిండీ, గుడ్డ, ఇల్లూ, ఉండని వాడుండకూడదు. ప్రతివాడు చదువుకోవాలి. రుజ నుండి క్షుధ నుండి ప్రజలు ముక్తి పొందాలన్నదే దాశరథి ఆలోచనాలోచనాల ధ్యేయాలు.

ఆ తరువాత వెలువడిన కవితాసంపుటి 'ధ్వజమెత్తిన ప్రజ'. దీనిలో 63 ఖండికలున్నాయి. ఇందులో శాంతిప్రియత్వం, యుద్ధ విముఖత, మానవత, ఆశావాదం అడుగడుగునా కనిపిస్తాయి. ఉగాది, దీపావళి, సంక్రాంతి వంటి పండుగలకు సంబంధించినవి. ఆంధ్రప్రదేశ్ అవతరణ వంటి సందర్భాల్లో రచించినవి ఉన్నాయి. 'ధ్వజమెత్తిన ప్రజ'లో ఉర్దూ కవితా ప్రక్రియ అయిన 'రుబాయి'ని ఎంతో చక్కగా రూపొందించాడు.

అగ్ని గీతాలు పాడాను

ఆనందంతో ఆడాను

మందారంలా ముందు నిలిచిన

సుందరి చేతిలో ఓడాను (అచుబింత జ్వాల) ఇలాంటి రుబాయిలు ఈ సంపుటంలో అధిక సంఖ్యలో ఉన్నాయి.

కాళోజీ నారాయణరావు, బిరుదురాజు రామరాజు, సి. నారాయణరెడ్డి వంటి మిత్రులు కలిసి 1952లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించడం జరిగింది. ఈ సంఘానికి స్థాపకుడైన దాశరథే. తొలి అధ్యక్షుడు.

దాశరథి ఆంధ్ర భాషా సాహిత్యాలకు చేసిన సేవకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 'కళాప్రపూర్ణ' బిరుదుతో 1975లో సత్కరించారు. 1976లో 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' యిచ్చి ఆగ్రా విశ్వవిద్యాలయం వారు సత్కరించారు.

దాశరథి ఎన్నో భాషా సాహిత్య సంస్థల్లో సభ్యుడుగా తన బాధ్యతల్ని నిర్వర్తించాడు. ఈయన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యనిర్వాహక సంఘ సభ్యులు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ సలహా సంఘ సభ్యులు. ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యనిర్వాహక సంఘ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ సభ్యులు. జాతీయ రచయితల సంఘానికి దక్షిణ మండల కార్యదర్శి. ఇవేకాకుండా అనేక సాంస్కృతిక, సాహిత్య సంస్థలతో ఈయనకు సంబంధాలున్నాయి. 1976లో అంతర్జాతీయ తెలుగు సంస్థ మలేషియా ఆంధ్ర సంఘం ఆహ్వానం మేరకు మలేషియా సందర్శించాడు. 1977 ఆగస్టు 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాశరథిని ఆస్థానకవిగా నియమించింది. 1983దాకా ఈ పదవిలో కొనసాగాడు.

1983లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్టీరామారావు నేతృత్వంలో సంఘ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఆస్థానకవి పదవిని రద్దుచేసింది. తనకు ఆత్మీయుడైన ఎన్టీరామారావు ముందుగా ఈ విషయాన్ని తనకు చెప్పకపోవడాన్ని దాశరథి జీర్ణించుకోలేకపోయాడు. అతని హృదయం బాధతో మూలిగింది. అయితే తన బాధను ఎవరితో చెప్పలేదు. దానితోనే ఆయనలో అస్వస్థత ప్రారంభమైనట్టుంది. అదిక్రమంగా నానాటికి అభివృద్ధి చెందింది. దాశరథి రష్యాలో పర్యటించి వచ్చాడు. ఆ విషయాలన్నింటినీ పుస్తకీకరించాలనుకున్నాడు. అయితే ఆ ప్రయత్నం కొనసాగకముందే గుండెజబ్బు ఆయనను క్రుంగదీసింది. 1987 సెప్టెంబరు 20వ తేదీ మదర్ థెరిస్సా ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. మధుమేహం కూడా ఉండడం వల్ల చాలా జాగ్రత్తగా ఉండాలనీ వైద్యులు సూచనలు చేశారు. చికిత్స ఫలించింది. దాశరథి మూడు వారాల్లో ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చాడు. తన మామూలు జీవితంలో పడ్డాడు. ఆత్మీయుల రాకపోకలతో ఇల్లు సందడిగానే ఉంది. 1987 నవంబరు అయిదవ తేదీ ఉదయాన ఫాస్టింగ్ షుగర్ టెస్టుకు రక్తమిచ్చేందుకు వెళ్ళివచ్చాడు. అల్పాహారం అయిన తరువాత ఇన్సులిన్ ఇంజెక్షన్ వేసుకున్నాడు. మామూలుగానే బాత్‌రూంకు వెళ్ళి అక్కడే తుది శ్వాస విడిచాడు.

సంకుచిత భావాలు, సంప్రదాయాలు గల కుటుంబంలో పుట్టిన దాశరథి విశాల మనస్తత్వంతో విరాజిల్లాడు. వైష్ణవ కుటుంబంలో పుట్టిన ఈయన వసుధైక మతవాదిగా పరిణమించాడు. నిష్ఠతో కూడిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన దాశరథి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆరాటపడ్డాడు. వేదపఠనంతో సరిపెట్టుకోవలసిన ఈయన విశ్వ శ్రామిక వేదాన్ని పఠించి వినూత్న వైదికుడయ్యాడు. మిత్రుల ప్రభావంతో కమ్యూనిస్టు భావాలకు మనసులో చోటిచ్చిన ఈయన హింసా విప్లవాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. గాంధేయ శాంతి విప్లవమే ప్రస్తుత సమాజానికి అవసరమని ప్రస్ఫుటంగా ప్రకటించాడు. స్థిరంగా నిలువగలిగేది కూడా ఈ విప్లవమేనని నిర్ద్వంద్వంగా ఉద్ఘాటించగలిగాడు. ఎన్నో బిరుదులను, పురస్కారాలను, సత్కారాలను పొందిన దాశరథి తెలుగుజాతికి లభించిన అమూల్య పురస్కారమంటే అతిశయోక్తి కాదు.

## ఆధార గ్రంథాలు:


1. దాశరథి కవిత – ఒక పరిశీలన – కె. రమాదేవి
2. దాశరథి కవితాదర్శనం – డి. లలితకుమారి
3. దాశరథి కవితాసమాలోచన – వి. చంద్రమౌళి
4. సాహిత్యంలో దృక్పథాలు – ఆర్.ఎస్. సుదర్శనం
5. సాహిత్యవివేచన – ఎం. సుబ్బారెడ్డి


* * *